
26112023-MAI-17_Layout 1 11/26/2023 6:08 AM Page 1



# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళా రూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



# విశ్వజనీన సామాజిక స్పృహకు మూలం

మనం తరుచుగా సకల మానవ సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, సామాజిక స్పృహ, మానవతావాదం, జాతీయవాదం అనే పదాలు వింటుంటాం. అత్యున్నతమైన ఈ ఆదర్శాలన్నీ మన పూర్వకాలం నుంచి ఉన్నాయి. వీటికి మూలం రామాయణం. రామాయణం గురించి అనేక వ్యాఖ్యానాలూ, వాదాలు, చర్చలూ, వాదోపవాదాలు వచ్చాయి. రామాయణంలో వాల్మీకి, రాముణ్ణి మానవుడిగానే చిత్రించాడు. మనిషిలో ఉండే అన్ని రకాల సహజ లక్షణాలను రాముడిలో, ఇతర పాత్రలలో చూపించాడు. ప్రపంచ సాహిత్యంలో రామాయణానికి ఒక ప్రత్యేకత ఉన్నది. మనిషి తానొక ఉత్తమవ్యక్తిగా, కుటుంబంలో ఉత్తమ సభ్యుడిగా, మంచి కొడుకుగా, మంచి సోదరుడిగా, మంచి మిత్రుడుగా, చివరకు మంచి శత్రువుగా ఎలా జీవించవచ్చో చెప్తుంది రామాయణ కావ్యం.

*వ్యక్తిత్వ వికాసం, పాజిటివ్ థింకింగ్, ఇవన్నీ కూడా మనసుకు హత్తుకునే విధంగా రామాయణం చెప్తుంది. ఇవన్నీ పాశ్చాత్యులకు ఇటీవల కాలంలో తెలిసిన విషయాలు. మనదేశంలో కొత్తగా కనిపెట్టలేదు. రామాయణంలో నిక్షిప్తమైన విషయాలే. మన యువత, ఈ విషయాలను తెలుసుకోవాలి. ఒకసారి రామాయణం చదివితే కమ్యూనికేషన్ స్కిల్స్, రోల్ మోడల్, పాజిటివ్ థింకింగ్ ఇలా ఎన్నో విషయాలు తెలుస్తాయి.*

*శ్రీ రాముడికి తెల్లారితే పట్టాభిషేకం అనుకున్నారందరూ. కానీ మరునాడు దశరథుడు రాముడిని అరణ్యవాసానికి వెళ్లమని ఆదేశించాడు. అప్పుడు లక్ష్మణుడు ఆగ్రహంతో తండ్రి మాటను ధిక్కరించమని అన్న అయిన రాముడితో అంటాడు. లక్ష్మణుడితో రాముడు 'ఈ రోజు నాకు పట్టాభిషేకమని చెప్పింది మన తండ్రిగారే. కానల కేగమని చెప్పినది వారే! కనుక దీంట్లో తండ్రి తప్పులేదనీ, అంతా కాలమహిమ' అని చాలా ప్రశాంతంగా లక్ష్మణుడికి చెప్పి తండ్రి ఆజ్ఞ శిరసావహించడానికి బయలుదేరుతాడు. దీని వల్ల మనం సుఖ, దుఃఖాలను సమభావంతో చూడాలని, సుఖానికి పొంగిపోక, దుఃఖానికి కుంగిపోక సంయమనం పాటించాలని తెలుసుకుంటాం.*

రాముడు అడవికి బయలుదేరుతూ తల్లి కౌసల్య ఆశీస్సుల కోసం వచ్చినప్పుడు రాముడితో కౌసల్య అంటుంది 'రామా ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్ని అతిక్రమించకు, అనుకూల పరిస్థితుల్లో ధర్మంగా ప్రవర్తించడం తేలిక కానీ నీవు వెళ్లేది అడవికి, అక్కడ ఉండే వ్యతిరేక పరిస్థితుల్లో కూడా నువ్వు ధర్మాన్ని విడిచిపెట్టకు. అదే ధర్మాచరణంటే, అని రాముడికి ఉద్బోధిస్తుంది. ఇది నాటికీ, నేటికీ, ఏనాటికీ చెక్కుచెదరని ధర్మ సూత్రం. ఈనాటి తల్లిదండ్రులు, పిల్లలను పెద్ద చదువులకుగానీ, ఉద్యోగాలకుగానీ, కొత్త ప్రదేశాలకు, విదేశాలకూ పంపేటప్పుడు చెప్పవలసిన ఆణిముత్యాల్లాంటి మాటలు.

రామాయణంలో దాంపత్యబంధం ఎంతో బాగా చిత్రీకరించారు. దాంపత్య సంబంధం కుటుంబ జీవితంలో శాంతికి మూలం. ఈ రోజున నాగరికతకు పరాకాష్ఠ అనుకుంటూ చిన్నచిన్న విషయాలకే భార్యాభర్తలు విడిపోతున్నారు. ఈనాటికీ భార్యాభర్తలను దీవించేటప్పుడు 'సీతారాముల్లా వర్ధిల్లండి' అని దీవిస్తారు వారి దాంపత్యబంధం అటువంటిది.

సీతాపహరణానంతరం, ఒక వ్యక్తిగా సీతకోసం రాముడు విలపించాడు, కానీ ధర్మపాలనకోసం, ఒక రాజుగా సీతను కానలకు పంపాడు. ఇది నేటి పాలకులందరూ తెలుసుకోవలసిన విషయం. న్యాయంగా పరిపాలించాలంటే, బంధుప్రీతి పనికిరాదని తెలియ చేస్తుంది ఈ సంఘటన.

*హనుమంతుడు లంకలో సీతాదేవి దుఃఖాన్ని పోగొట్టడానికి 'మరణిస్తే ఏమొస్తుంది? జీవించి ఉన్నట్లైతే ఎప్పటికైనా మంచిని చూస్తాం' అంటూ ఆమెను ఆశావాదం వైపు మళ్లిస్తాడు. నిరాశాంధకారంలో కొట్టు మిట్టాడుతూ ఆత్మహత్యలకు పాల్పడే యువతకు జ్ఞానబోధ, పాజిటివ్ థింకింగ్ వైపు ఆలోచింప చేసే ఉపదేశ మంత్రం ఇది.*

హనుమంతుడు లంకకు చేరడానికి నూరు యోజనాల దూరం సముద్రాన్ని లంఘించాలి. తనబలం తనకు తెలియదు. కానీ రామకార్యం కోసం సముద్ర లంఘనం కావించాలని సంకల్పించాడు. మధ్యలో ఎన్ని అడ్డంకులు వచ్చినా, లక్ష్యం వైపునకు దూసుకుపోయాడు. ఇది ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విషయం. చిన్నపెద్దా, యువత అందరూ కూడా, ఒక లక్ష్యం సాధించాలంటే, ముందు సంకల్పం ఉండాలి, ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమిస్తూ, లక్ష్యం వైపునకు దూసుకుపోవాలి. నేడు మనం వింటున్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అఛీవింగ్ గోల్ అన్నీ రామాయణంలోని సుందర కాండలో ఉన్నాయి.

అలాగే హనుమంతుడు లంకలో సీత జాడ కనుక్కొని ఆ శుభవార్త రామునికి చేరవేసేటప్పుడు ఆతృతగా ఎదురుచూస్తున్న రాముడికి 'చూశాను సీతను' అని చెప్పాడు. అంతే కానీ 'సీతను చూశాను' అనలేదు. 'సీత' అన్నమాట ముందు వినపడగానే ప్రాణాలు పోయేటంత ఆతృతగా ఉన్నాడు రాముడు. చూశాను అన్న మాట వినగానే ప్రాణం నిలబడింది ఆయనకు. ఒక చిన్న మాట ఎంతటి ఓదార్పు నిచ్చింది! అదే 'గుడ్ కమ్యూనికేషన్ స్కిల్'. ఇప్పుడు ప్రతి ఒక్కరూ కమ్యూనికేషన్ స్కిల్స్ కోసం స్పెషల్ కోచింగ్ క్లాసులకి వెళ్తున్నారు. ఇలాంటి విషయాలు రామాయణంలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ఇవన్నీ, దేశ కాల, జాతి, మత, కుల భేదాలేవీ లేకుండా ప్రతి మనిషికీ ఉపకరించే సన్మార్గ దారి దీపాలు.





'మ్యాన్ ఈజ్ ఏ సోషల్ యానిమల్' అని అరిస్టాటిల్ అన్నాడు. 'మ్యాన్ ఈజ్ ఏ ఫెరోషియస్ యానిమల్' అని బ్రిటీష తత్వవేత్త థామస్ హాబ్స్ అన్నాడు. ఈ రెండు విషయాలూ సత్యమే. ఈ రెండు ప్రవృత్తులకూ మూల కారణం ఒకటుంది అది మనిషిలోని స్వార్థపరత్వం. మనిషిలో సహజంగా ఉన్న ఈ స్వార్థ పరత్వాన్ని అణచి వేయాలంటే, మనిషి మనసును మార్చే మంచి మార్గదర్శనం కావాలి. ఈ సన్మార్గ దర్శనం మంచి మనసులో, పాజిటివ్ మైండ్‌తో రామాయణ పఠనం ద్వారా లభ్యమవుతుంది. ఎంతమంది ఎన్నిరకాలుగా విమర్శలు చేసినా, నేటి మన భారతీయ సమాజం- రామాయణ ప్రామాణికంగానే సాగుతున్నది. మనం చెప్పేనీతి సూత్రాలన్నీ రామాయణం లోనివే.


*ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న సామాజిక రుగ్మతలకూ, నైతిక పతనానికీ ఔషధ గుళికలు రామాయణంలో చాలా ఉన్నాయి. రామాయణం చదివితే, వ్యక్తి తనను తాను చక్కదిద్దుకొనడమే కాకుండా, కుటుంబాన్నీ చక్కదిద్దుకోగలుగుతాడు. అప్పుడు సమాజమూ, దేశమూ, ప్రపంచమూ వాటంతటవే చక్కబడతాయి.*

తండ్రి మాట జవదాటకూడదు, ఇంటికి పెద్దవాడికి బాధ్యతలు ఎక్కువ. తమ్ముళ్లు అన్నను గౌరవించాలి. వదిన తల్లి లాంటిది. భార్య భర్తను అనుసరించాలి. స్నేహం చేస్తే ప్రాణప్రదంగా చూసుకోవాలి, ఆడినమాట తప్ప కూడదు, కుండెడు పాలల్లో ఒక్క విషపు చుక్కపడినా పాలన్నీ విషమయినట్టు, వంద మంచి గుణాలున్నా, పరస్త్రీ వ్యామోహం అనే ఒక్కటి చాలు, దుర్మార్గుడిగా జమ కట్టడానికి. ఇవన్నీ ఈనాటికీ మన సమాజంలో చెలామణీలో ఉన్న నీతి సూత్రాలే.

నేటి సమాజంలో ఉన్న మానవతావాదం, జాతీయవాదం, స్త్రీవాదం వగైరా వాదాలు.. సామాజిక స్పృహ, విశ్వజనీనం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం... ఒకటేమిటి అన్నీ రామాయణంలో ఉన్నాయి. ఎక్కడికో వెళ్లి డబ్బు ఖర్చుపెట్టుకుని పర్సనాలటీ డెవలప్‌మెంట్ క్లాసుకెళ్లక్కరలేదు. రామాయణం ఒక్కసారి చదివితే చాలు. నవరసాలు రమ్యంగా చిత్రీకరించబడిన వ్యక్తిత్వ, సామాజిక, విశ్వజనీనమైన రామాయణం అందరూ చదవాల్సిన పుస్తకం. ఒక్కొక్క కవి రుచి ఒక్కోరకంగా ఉంటుంది. రసరమ్యం ఆస్వాదించిన కొద్దీ రుచి అధికమవుతుంది.



డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ
85001 22990



## కోయిల గళం-కాకి బలగం

కోటి గళాల కలాపాలు
భిన్నస్వరాల వేనవేల సుస్వరాగాలు
అధికారమధిష్టించే ఆరాటంలో
జనాల్ని వెర్రెత్తించే ప్రసంగాల ప్రలోభాలు

దశాబ్దాలు ప్రజల్ని కన్నెత్తిచూడని నిర్లిప్తనాయకత్వం
నేడు ప్రత్యక్షమై వల్లిస్తున్న ప్రబోధం
'నాకోసం కాదు - మీకోసం'
ఎన్నికల్లోనే స్ఫురించిన జీవన వేదం

సంక్షేమ జపమాల ధరించే రాజకీయం
ఒళ్లంతా పాకిన అధికార లాలసత ఈనాడు
తామసం కమ్ముకున్న మనోదౌర్బల్యం
సత్యాలను పాతరేసే చిత్రహింసలు

రాజ్యకాంక్ష రావణ కాష్టానికి రహదారి
అదే నేడు రాజ్యాధికార కౌటిల్యం
అగ్గిలా అలముకొన్న రాజకీయ మాలిన్యం

కటిక చీకట్లో పలవరించే దీన జనాలు
సిద్ధాంత కలిమి ఉద్ధరించని భావి జీవితాలు
దూరదృష్టి కరువైన దశాబ్దాల రాజ్యాధికారం

ఎన్నికలు ఓటరు విజ్ఞతకు విషమ పరీక్షా సమయం
దుష్ప్రచారాన్ని ఛేదించే బ్రహ్మాస్త్రం
లక్షల ఎకరాల ధాన్యాగారాల వరప్రదాయిని
'కాళేశ్వరం' కాలకూట విషమా?

సమగ్ర ప్రజాసంక్షేమం
కబోదుల కళ్లకు కనుమరుగైందా?
గోబెల్స్‌ను తలదన్నే అభూత కల్పనలు
కాలాతీతంగా నిలిచే నవ్య ఆలోచనాధారలు

కోటిదివ్వెల్ని వెలిగించే క్రాంతిరేఖలు
కాకి బలగం పేల్చే మారణాస్త్రం
అది కోకిలగళం సంధించే దివ్యాస్త్రంచే నిస్త్రాణం.



కె. లక్ష్మణ్ గౌడ్
97049 30509



## స్మృతుల లోగిలి

అదే వాన
ఎప్పుడూ కురిసేదే
కాకపోతే...
నువ్వు గుర్తొచ్చిన ప్రతిసారి
కొత్తగా తోస్తుందంతే...

ఆ పూల చెట్టంటావా
అదెప్పుడూ అంతే...
ఎప్పుడూ విరగ పూసినట్టే గుర్తొస్తుంది
అచ్చం నీ నవ్వులానే
కానీ అప్పుడప్పుడు
వాడినట్టు కనపడుతుంది
నీవు లేవన్న నిజం గుర్తొచ్చినప్పుడే

ఈ గాలి అంతే....
నీ తలపులా హాయిగా ఉంటుంది
ఎప్పుడన్నా నువ్వు లేవని ఠక్కున గుర్తొస్తేనే
విసిరి విసిరి వీచే హోరు గాలిలా
మనసు అతలాకుతలం అయితది

నెలవంక పెరిగినట్టే నీపై ప్రేమ పెరిగి పెరిగి
నా మోము నిండు పున్నమైంది
నీ నిష్క్రమణనే నిత్య జ్ఞాపకమై
జీవితాన్ని కటిక చీకట్లోకి నెట్టింది

అయినా నా పిచ్చికానీ
నిన్ను ప్రేమించకుండా ఉంటే
ఇంత పిచ్చి ఊహ ఊగిసలాట
ఉండకపోవునేమో!



దిలీప్.వి
84640 30808

# కవిత్వం ఉత్తమాభిరుచి

*కవుల్లో ఎంతో వైవిధ్యం-వారి కవితల్లాగే! కొందరు సామాజిక సమస్యలను ఎండగడితే, మరి కొందరు భావుకత్వంలో తెలియాడతారు. ఎవరు ఎలాంటి కవిత్వం రాసినా అది చదువరులలో స్పందన కలిగించేందుకే! అయితే కవులు ఏ కోవకు చెందినవారైనా, వారు అనుభూతి చెంది రాయకపోతే, ఆ కవిత్వం ఉద్దేశిత పాఠకులలో ఆ అనుభూతి కలిగించలేదు. కవులు ఎంత గాఢంగా తమ కవిత్వం పట్ల అనురక్తి కలిగి ఉంటే అంత ప్రభావశీలంగా వారి కవిత్వం ఉంటుంది.*

కవులు రాసేందుకు మథనపడాలి. ఒక్కో పదాన్నీ శిల్పంలా చెక్కాలి. అందులో వారి హృదయ లయ సంగీతంలా వినిపించాలి. వారి ఆత్మ వారి కవితల్లో ప్రతిఫలించాలి.అలా జనించిన కవిత్వం ఉత్తమ స్థాయిలో ఉంటుంది. కవులకు తమ కవిత్వం పట్ల చక్కని అభిరుచి ఉండాలి. జీవితం పట్ల సమ్యక్ దృక్పథం ఉండాలి. తమ కవిత్వం చదివే పాఠకుల పట్ల గౌరవం ఉండాలి. ముఖ్యంగా కవిత్వం పట్ల నిబద్ధత ఉండాలి.అపుడా కవిత్వం ఉత్తమోత్తమంగా విరాజిల్లుతుంది. తమ పేరు చూసుకోవాలనే ఉత్సుకత, గొప్ప పేరు సంపాదించుకోవాలనే తపన రెండూ వేరు. కేవలం పేరు చూసుకుంటే చాలనుకుంటే ఉత్తమ కవిత్వం రాయలేరు. గొప్ప పేరు సంపాదించుకోవాలంటే అందుకు నిజాయితీగా కృషి చేయాలి. గొప్ప కవుల రచనలు చదవడం అందులో ఒక భాగం మాత్రమే! జీవితాన్ని పరిశీలించే ఆసక్తి ఉండాలి. సమాజం పట్ల బాధ్యత ఉండాలి. తమకంటూ ఒక ప్రత్యేక వైఖరి ఆ కవిని భిన్నంగా నిలబెడుతుంది. కవి సంస్కారం అతని రచనల్లో ప్రతిబింబిస్తుంది.

కవి ప్రాపంచిక దృక్పథం అతని కవిత్వానికి నిండుదనం తెస్తుంది. ముందుగా భాషాపుష్టత, పద సంపద, వాక్య నిర్మాణ కౌశలం పెంపొందించుకోవడం కవి తొలి మెట్టు. తర్వాత ఎంత సుందరంగా కవితా భవంతి నిర్మిస్తాడో అతని నిరంతర కృషిపై ఆధారపడి ఉంటుంది. కవిత్వాన్ని సీరియస్‌గా తీసుకోవడమంటే, జీవితాన్ని సీరియస్‌గా తీసుకోవడమే! అలా నిబద్ధతతో కవిత్వం రాసినట్టయితే ఆ కవి తప్పక కవన జగత్తులో తన ముద్ర వేయగలడనడంలో ఎలాంటి సందేహం లేదు!!



దండమూడి శ్రీచరణ్
98661 88266

# అనుభూతినిస్తేనే జనరంజక సాహిత్యం

*సాహిత్యంలో ఏ రచన అయినా పాఠకుడు మానసికంగా అనుభూతి పొందక పోతే అది వ్యర్థమే. అది కవిత్వమైతే మరింత క్లిష్టతరమవుతుంది. కవులు/రచయితలు కూడా నాలుగు కాలాల పాటు మనగలగాలనుకుంటే ఖచ్చితంగా పాఠకుడి మనసును చదివి అలరించే రచన చేయాల్సిందే. అయితే ఈ వాదనను చాలామంది సాహిత్యకారులు/కవులు ఒప్పుకోక పోవచ్చు ఎందుకంటే కవిత్వం /కథ రాసేది తమ మానసిక ఆనందం కోసమే, అది అర్థం చేసుకొనేవాళ్ళు ఉంటే చాలనుకునేవారు కూడా ఉన్నారు. క్లిష్టమైన రచనను అర్థం చేసుకునే వారే నిజమైన పాఠకులు అవుతారు.*





నిజమైన పాఠకుడు అని ఎవరిని సంబోధించవచ్చు? నేటి బిజీ ప్రపంచంలో, చాలా మందికి చదవడానికి సమయం కేటాయించడం కష్టం. కాబట్టి, నిజమైన పాఠకులు దీన్ని ఎలా చేస్తారు? నిజమైన పాఠకులు ఎక్కువ సమయాన్ని చదవడానికి ఎంచుకుంటారు. ఒక పుస్తక పాఠకుడు చనిపోయేలోపు వెయ్యి జీవితాలను గడుపుతాడు, ఎప్పుడూ చదువని మనిషి ఒక్కటే జీవితాన్ని గడుపుతాడు.

ఒక పాఠకుడు కథ/నవలకు కనెక్ట్ అయినంతగా త్వరగా కవిత్వానికి కనెక్ట్ కాలేడు. కారణం ఏంటంటే చాలావరకు కవిత్వపు పరిభాష తెలియకపోవడం మొదటి కారణమైతే, రెండవది సంక్లిష్టత కావొచ్చు. పాఠకుడు దేనివైపు ఉండాలనేది వ్యక్తిగత ఎంపిక. అభ్యుదయ, విప్లవ, భావా, పద్య, కాల్పనిక ఇలా కవిత్వపు రకాల్లో దేన్నైనా ఎంపిక చేసుకోవచ్చు. కవిత్వానికి దగ్గర కావాలంటే ఖచ్చితంగా వాటిపై అవగాహన ఉండాలి. అప్పుడు కానీ కవిత్వాన్ని అర్థం చేసుకోలేడు. కొంచెం పాతకాలంలోకి వెళ్తే సాధారణ పాఠకుడు కూడా అద్భుతమైన కవిత్వాన్ని ఆస్వాదించాడు. అయితే అది కూడా ఒక స్థాయి సాహిత్య పరిచయమున్న పాఠకుడిని మాత్రమే అలరించేవి. మరీ సంక్లిష్ట కవిత్వాన్ని మాత్రం కవితా పరిభాష తెలిసిన వాళ్ళు మాత్రమే ఆస్వాదించేవారు.

రచన ఏదైనా దాని ప్రధాన లక్ష్యం పాఠకుడిని అలరించడమే. భిన్న సంఘటనల్ని వస్తువులుగా స్వీకరించి రచయిత తన రచనను జనరంజకంగా తయారు చేస్తారు. అయితే చదవటం మొదలుపెట్టి చివరిదాకా చదివించే గుణం ఉన్నదే ఉత్తమ రచన.

కవి నిత్యం జరిగే సంఘటనలు/వాస్తవికత దృక్పథంతో సమస్యకు పరిష్కారం చూపుతాడు. అయితే సమాజపు నవీన పోకడలు, సమస్యలను కవిత్వంగా మలచడంలో ఒక్కోకవి ఒక్కోరకంగా స్పందిస్తాడు. తాను ఎంచుకున్న వస్తువును వివిధ అలంకారిక సాధనాలతో కవితగా మలుస్తాడు. అది పాఠకుడికి చేరేలా చేయడంలో సఫలమవుతాడు. కానీ అది పాఠకుడిని అలరించాలంటే అర్థమవ్వాలి. అర్థం కానీ ఏ కావ్యమైనా పక్కన పడేసి ముందుకు వెళ్లిపోయే సౌలభ్యం పాఠకుడికి ఉన్నది.

కుందుర్తి తాను నిర్దేశించిన అభిప్రాయాలకనుగుణంగానే, తన కవిత్వమంతటినీ రాశాడు. ప్రజా సంబంధమైనవస్తువు, భావన, భాష, అలంకారం – ఇవన్నీ ఆయనను సంపూర్ణ ప్రజాకవిగా మలిచాయి. ఉదాహరణకి 'నగరంలో వాన' నుంచి కొన్ని పంక్తులు.

*'నగరంలో వాన*
*కవిత్వం నా ఊహాంచుల్లో కదలాడినట్లు*
*జల్లులు జల్లులై కురుస్తోంది*
*ఆశుకవితతో నగర ప్రజలకు*
*ఆశీస్సులు పలుకుతున్నట్లు'*

చూడండి ఎంత సరళత ఉన్నదో. కుందుర్తి కవిత్వంలో సరళతతోపాటు లోతు ఉన్నది. వైవిధ్యం వస్తురూపాల్లో ఉన్నది. అన్నీ వెరసి అద్భుత భావాత్మక లయ శిల్పంతో తనదైన శైలిలో కొనసాగుతుంది. వస్తువులో ప్రాకృతిక, వైయక్తిక, నగర సంక్లిష్టత, ట్రావెలోగ్, ఎలిజీ లాంటివి అనేకం ఉన్నాయి. ఇలాంటి కవితల్లో సందర్భం ఏమిటన్నది ఇట్టే తెలిసి పోతుంది. శ్రీ శ్రీ కవితలు కూడా సూటిగా పాఠకుల మనస్సులోకి వెళ్లాయంటే సరళత/సామాన్య భాషా/వాడుక పదాలు అని చెప్పొచ్చు. అలాగే ఆరుద్ర కూడా 'కూనలమ్మ పదాలు' పేరుతో విశేషమైన పేరు సంపాదించారు. అదే విధంగా, మినీ కవిత్వంతో అలిశెట్టి ప్రభాకర్ అలరించారు. కొద్ది పదాల్లోనే అద్భుతమైన భావాన్ని వెలువరించి జనాల్లో ముఖ్యంగా పాఠకుల మనసులో చెరగని ముద్ర వేసిన వీరు ఎప్పటికీ గుర్తుంటారు.

కవిత్వంలో భాష అనుభూతుల్ని ప్రభావితం చేస్తుందని రిచర్డ్ అభిప్రాయం. అందుకే కవి తాను రాసే కవిత్వంలో పాఠకుడి మనసును హత్తుకునేలా అనుభూతుల్ని స్పృశించగలిగితే తప్పకుండ విజయం సాధిస్తాడు. పూర్వ కాలపు కవుల రచనలు ఇప్పటికీ చదువటానికి, చదివించటానికి గల కారణాలు అవే. ఇప్పటి నవతరం కవులు ఎక్కువగా అనుభూతి వాద కవిత్వానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎందుకంటే కవిత్వం ఒక ఎమోషన్. ఆ ఎమోషన్‌ను చక్కగా తమ కవితల్లో ఉండేలా చూసుకుంటున్నారు.

కళారూపంలో అనుభూతులు వ్యక్తం చేయటానికి ఒకే ఒక మార్గం బాహ్యాంశాన్ని కనిపెట్టడమే. ఇంకొక రకంగా చెప్పాలంటే కొన్ని వస్తువులు గాని, ఒక సన్నివేశం గాని, కొన్ని సంఘటనల సమాహారం గాని, ఒకానొక నిర్దిష్టమైన అనుభూతికి సూత్రం అవ్వాలి. అంటే బాహ్య వాస్తవాలు చెప్పగానే వెంటనే అనుభూతి పుట్టుకు రావాలి. సంబంధిత బాహ్యాంశం అంటే కవి అనుభవించి వ్యక్తపరిచే అనుభూతిని సమానంగా పాఠకుడిలో కలిగించడానికి కవిత్వంలో ప్రయోగించే ఒక పద్ధతి. అందుకని కవి ఒక సంఘటనను తాను అనుభవించి. అనుభూతి చెందిన వాటిని కవిత్వంలో ప్రతిఫలిస్తే కవి అనుభవించిన అనుభూతి అచ్చంగా పాఠకుడికి కలుగాలి అప్పుడే ఆ రచనతో పాఠకుడు ప్రయాణిస్తాడు.

నిజమైన పాఠకుడు అన్ని రచనలను సమదృష్టితో ఎలాంటి పక్షపాతం చూపకుండా చదివి అందులోని రసానుభూతిని ఆస్వాదిస్తాడు. పాఠకుడి స్వేచ్ఛను గౌరవించినప్పుడు మాత్రమే సాహిత్యం పరిపుష్టి అవుతుంది. రచయిత –రచన–పాఠకుడు ఇది ఒకవృత్తం. నిరంతరం పరస్పరం అర్థం చేసుకొని ముందుకు సాగితేనే సాహిత్యం పరిఢవిల్లుతుంది. అసలు పాఠకుడనే వాడు లేకుంటే రచయిత ఎక్కడ ఉంటారు? అని ప్రశ్న వేసుకుంటే కొంచెం కష్టమైనా చేదు వాస్తవమే.



పుష్యమీ సాగర్
79970 72896



## యుద్ధం

నా నేల
నా వనరులు
నా ఇల్లు
నా బతుకు .. నా నేలపై

వాడు వచ్చాడు
ప్రపంచమంతా తిరిగి తిరిగి
ఎక్కడా ఇసుమంత చోటు దొరక్కనా చెంతకు,

పోనీలే అని ఇంత జాగా వాడికిచ్చా
మతాలు వేరైనా మనిషని ,
తిన్నింటి వాసాలు లెక్కెట్టాడు
నా నేలను ముక్కలు ముక్కలు జేస్తూ
ముందుకు సాగుతున్నాడు.

దురాక్రమణలో వాడు
మనిషి కాదు ఉన్మాదని గ్రహించే లోపే
దాడులతో వాడు,
నేనేమో పిడికిలి బిగిస్తున్నా!
పుట్టిన నేలను దక్కించుకోవాలని!
నేను తునాతునకలైనా చివరంటా!
ఎరుపు నా తోవ!!



గిరి ప్రసాద్ చెలమల్లు
94933 88201

### కలం పిలుపు

## ఖమ్మం ఈస్తటిక్స్ ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ 2023 సాహిత్య పోటీల ఫలితాలను ప్రకటించారు. కవితల్లో సెల్ఫీ (వసీరా) ప్రథమ బహుమతికి ఎంపిక కాగా నాలుగురెక్కలపిట్ట (సాంబమూర్తి లండ), గాంధారివాన (అనిల్ డ్యానీ), లోపలి ముసురు (అరుణ నారదాభట్ల) జ్యూరీ ప్రశంసా పురస్కారాలకు ఎంపికయ్యాయి. కథల్లో లడాయి (శ్రీ ఊహ) ప్రథమ, ఆరోతనం (స్వర్ణ కిలారి) ద్వితీయ, సంభావన (ఉమా మహేశ్వర్.జి) తృతీయ బహుమతులకు ఎంపికయ్యాయి. కలలు రాలుతున్న నేల (పెద్దింటి అశోక్), నా స్నేహితురాలు (కుప్పిలి పద్మ) లు జ్యూరీ ప్రశంసా పురస్కారాలకు ఎంపికయ్యాయి. -ఖమ్మం ఈస్తటిక్స్

## కవితా సంపుటి ఆవిష్కరణ

కరిపె రాజ్‌కుమార్ కవితా సంపుటి - ఆజాదీ ఆవిష్కరణ 26 ఆదివారం ఉదయం 10.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. కె. ఆనందాచారి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. డా. రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. డా. కాంచనపల్లి గోవర్ధన్ రాజు , కొమ్మవరపు విల్సన్‌రావు, ఎం. నారాయణశర్మ, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ ప్రసంగిస్తారు. -గుడిపాటి